# గురుదేవో భవ!

జిల్లా పరిషత్ కార్యాలయం'' అని పెద్ద పెద్ద అక్షరాలు వ్రాయబడి ఉన్నాయి గోడమీద. 'జిల్లా'కు 'పరిషత్'కు మధ్యలో 'ప్రజా' అనే రెండక్షరాలూ కనబడకుండా కాగితాలు అతికించేశారు. ఆ అలసత్వాన్ని ఎత్తి చూపుతూ చిరిగిన సందుల్లోనుండి తొంగి చూస్తున్నాయి 'ప్రజా'లు.

ఆలోచిస్తూ ఆఫీసు మెట్లెక్కుతున్నాడు ఆనందరావు.

''నమస్కారం సార్!'' తెల్లని ఖద్దరు వస్త్రాల్లో, చెరగని చిర్నవ్వుతో నిండైన విగ్రహం.

గుర్తుకు తెచ్చుకుంటూ ఉండిపోయాడు మేష్టారు ఆనందరావు.

''నేను సార్! సాయిలును. గడ్సింగాపురం...కోడి గుడ్లు... బెత్తం దెబ్బ...'' అంటూ క్లూ ఇచ్చాడు నవ్వుతూ.

ఓరోజు ఆరోతరగతిలో దొంగతనంగా కోడి గుడ్లు తెచ్చుకున్నాడు సాయిలు. మాంజా (గాలిపటాల ప్రత్యేక దారం) తయారు చేసుకోవాలని, అవి వాడి నిక్కరు జేబులో ఉన్నాయని తెలియని తాను బెత్తంతో కొట్టడం, అవి పగిలిపోయి ద్రవం కారడం, తరగతి గది వాతావరణం గందరగోళంగా మారడం, ఆ వెంటనే వాడు రెండు వేళ్ళూ చూపిస్తూ బయటికి పరిగెత్తడం- అంతా ఠక్కున గుర్తొచ్చింది ఆనందరావుకి.

''ఓర్నీ! నువ్వటయ్యా? బాగున్నావా? అమ్మా నాన్నా బాగున్నారా? నువ్వేంటి ఏదో స్పోర్ట్స్‌మాన్‌వౌతావనుకుంటే..'' ప్రశ్నలు కురిపించాడు వెంటనే.

''నేను పదో తరగతికి రాగానే అమ్మపోయింది సార్. స్టేట్‌లెవెల్ అథ్లెటిక్స్‌కి అటెండ్ కాలేకపోయాను. ఆపై మా నాయన మంచాన పడటం, మా పాలోళ్ళు ఎగస్పార్టీతో చేతులు కలిపి, రాజకీయంగా, మానసికంగా, ఆయనను దెబ్బతీసారు. ఆ షాక్ నుండి ఆయన కోలుకోలేదు. నాయన చనిపోవడంతో నా యింటర్ డిస్ కంటిన్యూ అయింది. కుళ్ళు రాజకీయాలపై తిరుగుబాటుగా, నాయన ఆదర్శాలకు దీటుగా, పార్టీల ప్రమేయం లేని రాజకీయ శక్తిగా ఎదిగేందుకు నేను కృషిచేశాను. చిన్నప్పుడు మీరు చెప్పిన మాటలు జీవితమంతా నాకు గుర్తుంటాయిసార్. మాతృదేవో భవ! పితృదేవో భవ! ఆచార్యదేవో భవ! కృషితో నాస్తి దుర్భిక్షమ్! ఇవన్నీ నిజం చేయాలని, అప్పుడే ఈ సమాజం బాగుపడ్తదని..సారీ సార్! ఏమేమో మాట్లాడుతున్నాను. మిమ్మల్ని చూడగానే''

ఆనందంతో పొంగిపోయాడు ఆనందరావు.

''రండిసార్! అలా వెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం. టీచర్ బాగున్నారా? చెల్లెళ్ళు బాగున్నారా? ఏం చదువుతున్నారు? ఇంతకూ ఇప్పుడేం పనిమీద వచ్చారు'' అడిగాడు.

''చైర్మన్‌ను కలుద్దామని వచ్చాను. నా ట్రాన్స్‌ఫర్ నిలుపు చేయడంగాని, మోడిఫై చేయడం గానీ చేస్తే చాలు!'' చెప్పారు మేష్టారు.

''రండిసార్! చైర్మన్ మనవాడే. మనమాట కాదనడు.'' గురువుగార్ని వెంట బెట్టుకొని చైర్మన్ చాంబర్‌లోకి వెళ్ళాడు.

''ఊ! ఏం పేరన్నావూ?'' జారుతున్న కళ్ళద్దాలను ఎడమచేతి నడిమివేలుతే పైకి నెట్టుకున్నాడు చైర్మన్ శరభయ్య.

''ఆనందరావు సర్!'' వినయం, ఆదరం ఉట్టిపడ్డాయి ఆనందరావు గొంతులో. అంతకుముందే సాయన్న పరిచయం చేసి వెళ్ళాడు.

''ఊ! అయితే నీకు ట్రాన్సుపర్ క్యాన్సల్ గావలెనా?'' దీర్ఘం తీస్తూ అడిగాడు.

''.......'' అసౌకర్యం ఆనందరావు మొహంలో.

''అవున్‌వయా! టీచరంటే ఏమన్నా మినిష్టరనుకున్నావా? నీపై అదికారి ముందల నీవు గిట్ల కూసోని మాట్లాడ్తావా? పిల్లలకు గూడ గిదే నేర్పిస్తున్నావా?''

యాంత్రికంగా లేచి నిలబడ్డాడు.

''గా సాయన్నగానికెన్ని పైసలిచ్చినవ్? వాడేమన్న ఎమ్మెల్యే అనుకున్నావా? ఎం.పీ. అనుకున్నవా? వాడొచ్చి గిట్ల జెప్పంగనే గట్ల బుగులువట్టి నీ పని జేసేస్తననుకున్నావా?''

కాళ్ళకింద నేల కదుల్తున్న అనుభూతి మేష్టారికి.

''యాడికి ట్రాన్స్‌పరైతే ఏం బొయ్యేదున్నది వయ్యా? ఆ..? యాడైన ఉత్తగ గూకునేదే. గిప్పుడున్న ఊరు బస్తీకి దగ్గెరున్నది. పుసుక్కున రావొచ్చు. పుసుక్కున వోవచ్చంటాని జూసుకున్నావ్? లేకపోతే సైడు బిజినెసేమన్న మొదలు వెట్టినవా?''

శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను చీల్చినట్లు చైర్మన్‌పైకి లంఘించాలనిపించింది రావుకి. కళ్ళల్లో ఎర్రజీరలు స్ఫుటమయ్యాయి.

''ఏందివయా కొడ్తవా?'' ఆనందరావు మనస్సును చదువుతున్నట్లుగా శరభయ్య.

'ఒరేయ్! ఉపాధ్యాయుడంటే అర్థమే తెలియని వెధవా! నీవు పదవిలో నుండి దిగితే నిన్ను కుక్కలు కూడా ఆదరించవు! నీకూ నాకూ పోలికేమిట్రా?' అనలేకపోయాడు ఆనందరావు. అది బలహీనతో, సంస్కారమో, సహనమో.

వచ్చిన 'పనైపోయిం'దన్నట్లు వెళ్ళేందుకుద్యుక్తుడయ్యాడు.

అప్పుడే లోపలికొచ్చిన డిప్యూటీ ఇ.ఓ. ని చూడకుండానే ద్వారం వైపు అడుగులేశాడు.

''హలో మేష్టారూ!' గబగబా చైర్మన్ దగ్గరికి వెళ్తున్న డిప్యూటీ ఇ.ఓ. విష్ణు, ఆనందరావును చూసి పలకరింపుగా అన్నాడు.

రెండు చేతులూ జోడించాడు ఆనందరావు.

ఆనందరావు కళ్ళల్లోని ఎరుపు, ముఖంలోని బాధ విష్ణు చూపునుండి తప్పించుకోలేదు. అదే స్పీడుతో చైర్మన్ దగ్గరికెళ్ళి కరచాలనం చేశాడు. ప్రక్క సీట్లో కూర్చున్నాడు.

''రండి మేష్టారూ! అలా వెళ్తారేం! ఒక్క నిముషం'' ఆనందరావును సాదరంగా పిలిచాడు.

వెనక్కి తిరిగాడు రావు.

వెండి కొండ, నల్లరాతి బండ ప్రక్కపక్కనే ఉన్నట్లు అనిపించింది విష్ణు, శరభయ్యలను చూస్తుంటే అతనికి.

''ఈ విద్యా సంవత్సరానికి జిల్లా స్థాయిలో బెస్ట్ టీచర్ అవార్డుకి మనం ప్రపోజ్ చేసిన మూడు పేర్లలో మొదటి పేరు ఈ మేష్టారిదే సర్! నేను అన్ని కోణాల నుండి స్టడీ చేశాను..'' ఆపై ఏమేమో వివరిస్తున్నాడు.

మేష్టారి గురించి ఒక్కోమాట వింటుంటే శరభయ్య మొహంలో రంగులు మారసాగాయి.



'దొరవేటి'

★